# తోడు దొంగలు

— అవంతి

సుబ్బారావుకి బాల్యం గట్టి నమ్మకాలేం కొన్ని వున్నాయి. కమ్యూనిస్టులు దేశ ద్రోహం చెయ్యడానికే పుట్టేరన్నది వాట్లలో ఒకటి. 1942 నాటికి తనది ప్రపంచ జ్ఞానం తెలియని వయస్సు. ఆనాడు "ప్రజా యుద్ధం" పేరుతో దేశాన్ని అమ్మెయ్యడానికే సిద్ధం అయ్యేరన్నది తనకి సంబంధించినంతవరకు కేవలం శ్రుతజ్ఞానం. పుస్తక జ్ఞానమైనా. మూన్నాళ్ళేళ్ళ తర్వాత మొన్న "ఆంధ్రోద్యమం" సందర్భంగా ప్రత్యక్ష జ్ఞానమే కలిగింది. తన ఆంధ్రసేనతో వాళ్ళ విశాలాంధ్ర భవనాన్ని నేలమట్టం చేసెయ్యాలనుకొన్నాడు కాని కాని... కుదిరింది కాదు. అందుకెన్నోమారు దుఃఖపడ్డాడు. అయితేనేం.

..వీధిలో జనం కోలాహలంగా వెడుతున్నట్లు అనిపించి సుబ్బారావు తడక తీసుకొని గేటులో కొచ్చేడు...

వీధి మూలలో షావుకారు సుబ్బయ్య కొట్టుముందు జనం బుట్టలు తట్టలతో నిలబడున్నారు. వెంటనే కొడుకును కేకేసేడు. మొలతాడులో దోపిన నిక్కరు ఎగలాక్కుంటూ ఎనిమిది పదేళ్ళ కుర్రాడు పక్క యిళ్ళ లోంచి పరుగెత్తి వచ్చేడు.

"అమ్మనడిగి సంచీ. డబ్బులూ తీసుకురా. సుబ్బయ్య కొట్లో బియ్యం అమ్ముతున్నారు కాబోలు. వెళ్దాం."

ఆ పలుకుకోసమే కాచుకుని నిఃబడి వున్నట్లు కాంతమ్మ పంచీ, రెండు రూపాయలూ ఇచ్చింది,

"దీనికేం వ స్తయ్యే. కిలోకూడ నిండుగారావు. సూడు మరో రూపాయి."

"నువ్వు తెచ్చింది నిలవచేశా"-నంది కాంతమ్మ విసుగ్గా.

మోటార్ షెడ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్న తనకి ఆదాయం ఎంతో-ఇద్దరు పిల్లలతో తన కుటుంబం ఖర్చెంతో సుబ్బారావుకి బాగా తెలుసు. అందుచేత మరి మాట్లాడలేదు. విసుగ్గా తన అసమర్థతని కప్పి పుచ్చుకొంటూ, "ఆ చొక్కా ఇల్లా పడెయ్యి" అన్నాడు.

కాంతమ్మ చొక్కా తెచ్చే లోపునే సైకిలుమీద రామదాసు ఆయాస పడుతూ వచ్చేడు.

"ఏంటిరా అది ?"

రామదాసు ఒగరుస్తూ చెప్పేడు,

"రాంకిష్టయ్యగోరు నిన్ను నించున్నపాటివి కొట్టుకు రమ్మన్నారు."

"మళ్ళీ ఏం వచ్చిందబ్బా !" అనుకున్నాడు సుబ్బారావు.

"కమ్యూనిస్టోళ్ళు బియ్యపుకొట్లు దోసేసుకుంటున్నారంట."

సుబ్బారావు సంశయంగా సుబ్బయ్య కొట్టువేపు చూసేడు.

"కమ్యూనిస్టులూ!" అనుమానం తీరక సుబ్బయ్య కొట్టువేపు మిర్రి మిర్రి చూసేడు.

"అటునుంచే ఒచ్చేవుగందా."

రామదాసుకి అర్థం అయింది నవ్వేడు,

"సుబ్బయ్య పెద్ద కొడుకే అక్కడ కూరుసున్నాడు. కిలో రూపా యికి అమ్ముతున్నాడంట." అన్నాడు.

సుబ్బయ్య కొడుకే వున్నాడని రామదాసు చెప్పేక నమ్మకపోవల సిన అవసరం సుబ్బారావుకి కనిపించలేదు. పైగా జనం అంతా పోగుపడి తుమ్ముకోకుండా బారులు తీరి క్యూలో నిల్చుంటున్నారు. అప్పుడే అది హనుమంతుడి తోకలా పెరిగిపోతూంది.

"కిలో రూపాయా!"

"అల్లాగే అంటున్నారు."

ఈ అవకాశం జారవిడుచుకోకూడదు. గవర్నమెంటు చౌకడిపోలు తెరుస్తామంటూంది. అంతవరకూ సుబ్బయ్యని అలా అమ్మ మన్నారేమో?

సుబ్బారావుకి తన్ను పిలిపించడం అంత అత్యవసరమేనా అని పించింది. "ఇంటో బియ్యంలేవురా. తెచ్చుకుని వస్తున్నానని చెప్పు" అన్నాడు.

"నాకేం తెలీదు. మిషనుకి ఆయిలేస్తున్న వోడిని అంపేరు. సైకిలు నీకిచ్చి పంపించమన్నారు."

"అయితే అదేదో తొందర...."

"నేకుంటే పని మానిపించి పంపిచ్చరు" అని రామదాసు ఒప్పు కొన్నాడు.

సుబ్బారావు ఒక్క క్షణం ఆలోచించి కాంతమ్మను కేకేసేడు.

ఆమె వచ్చేలోపున రామదాసు చేతినుంచి సైకిలు అందుకొన్నాడు. భార్య వచ్చేసరికి చేతిసంచి గుమ్మంలోకి విసిరేడు.

"కిలో రూపాయంట. సుబ్బయ్యగారి కొట్లో అమ్ముతున్నారంట. నువ్వెల్లి తే! రాంకిష్టయ్యగోరు మనిషి నంపేరు. పోతున్నా."

ఆమె సమాధానంకోసంకూడా ఆగకుండా సుబ్బారావు ఎగిరి సైకిలుమీద కూర్చున్నాడు. అతని మాటల అర్థం తెలిసి, ఏదో అనబోయే

సరికి అప్పుడే పదిగజాలు దూరంలో వున్నాడు. సైకిలు వేగం అందు కొంటూంది. మరి అరిచి లాభంలేదనుకొని కాంతమ్మ రామదాసునే అడి గింది.

"ఏంటి, రాందాసూ! కిలో రూపాయేంటి!"

"నీకు తెలీదా?"

"ఉహుం."

"పేటలో యూతులీ గోళ్ళంతా కిలో రూపాయికి బియ్యం దగ్గ రుండి అమ్మిత్తున్నారు."

కాంతమ్మకి నమ్మకం కలగలేదు.

"కిలో రూపాయి!"

"అవు"

"సుబ్బయ్య కొట్లో...."

"అవు"

కిలో రెండూ, రెండున్నర రూపాయలు అమ్మే సుబ్బయ్య రూపాయికమ్మడం అంటే నమ్మలేక పోయింది.

"అదెల్లా"

"గవర్నమెంటోళ్లు పెట్టిన రేటుకి అమ్మాలన్నారు చంగంవోళ్ల కాదన్నా ఇనేది లేదన్నారు. జనం తిండిలేక చత్తూంటే నాయాల రెండ్రూ పాయలే కావాలంట్రట! నీ దిక్కున్నచోట సెప్పుకో. మేమే అమ్మేత్తా మన్నారు." ఆ కధంతా తన ఎదటే జరిగినంత ధీమాతో.

కాంతమ్మ నోరు తెరుచుకు వింటూంది.

"పోలీసోళ్ళు...."

ఆమె భయం రామదాసుకర్థం అయింది.

"రానీ, యాల్లమ్మ....తలకొట్టి మొలేత్తరా! తిండినేక సచ్చేకన్న ఆ జైల్లనే కూకుందాం. ఆళ్ళే యింత పడేత్తరు."

ఇంకా ఆంకా ఆమె అనుమానం తీరినట్లు కనబడకపోతే రామదాసు అంతవరకూ చెప్పివుండని అసలు తుకుపుముక్క మాటని వదిలేడు.

"అసలిదంతా ఏరుపాటు చేసింది కమ్యూనిస్టోళ్లు. యువజన సంగంవాళ్ళని దగ్గరుండి పనిచేయిస్తున్నది. మనపేటోదే రంగనాయకులు లేడూ. ఆయనే."

ఈ మారు కాంతమ్మకు నమ్మకం కలిగింది. కమ్యూనిస్టులూ, పోలీసులూ, గవర్నమెంటూ ఒకటైపోయిందని తన మగడూ వాళ్ళ మాటల్లో నిత్యమూ వింటున్న కాంతమ్మకు ఇప్పుడు పోలీసు భయమూ లేకుండా పోయింది వాళ్ళంతా కూడబలుక్కుని అమ్మిస్తుందొచ్చు."

ఏంది కాంతమ్మో, ఇంకా కూకుందవు. సిన్నోడినైనా అంపితివా.. బియ్యం అమ్మిత్తుంటారు. కమ్యూనిస్టోళ్లు, మల్లిగిపి అయిపోయాని....."

— అనే కేకతో కాంతమ్మ ఈ లోకంలో కొచ్చింది. తనకి నాలుగిళ్ళ అవతలి సుభద్ర. ఆమె చేతిలో చిన్నమూట మాత్రమేచూసి ఆశ్చర్యంగా అడిగింది.

"కిలో రూపాయి!"

"అవు"

"అంతే తెస్తుంటివే"

"ఎదవనాయాళ్ళు మనిషికి కిలో కన్న ఇవ్వనీటంలేదు. దెబ్బలాడి రెండు తీసుకున్నా. పిల్లనీ, పిల్లోడినీ క్యూలో నించుండబెట్టి వత్తున్నా"

కాంతమ్మ మరి మాటవినలేదు.

"మల్లీ అయిపోయాను, బేగెల్లు" అంటున్న సుభద్రమాట వెనక నుంచి తరుముకుని వస్తూంటే కొడుకుని కేకేసింది.

"బేగిరార బుల్లి గో"

కాంతమ్మ తన ముందింకా నలభై య్యేభయిమంది వరకూ నిలబడి వుండడం చూసింది. కొట్టు గుమ్మంలో నిలబడి రంగనాయకులు ఏమిటో కేకలేస్తున్నాడు. సుబ్బయ్య కొడుకు బియ్యం కొలిచీ వాళ్ళకి అడ్డం వచ్చేడు.

జనంలో ఆదుర్దా పెరుగుతూంది. మాటలు వినబడకపోయినా జరుగుతున్నదేమిటో వాళ్లు సరిగ్గానే ఊహించేరు.

"సుబ్బయ్య కొడుకు మరి అమ్మనంటున్నాడు."

"మనకుండవు కాబోలు...."

"కూంత బేగి రానేకపోయానే...."

కాంతమ్మ తన చుట్టుప్రక్కల యిళ్ళవాళ్ళందరూ తనతో చెప్ప కుండా వచ్చేసినందుకు కోపంతో మండిపడుతూంది.

"కూంత నా సెవినికూడా ఏస్తే నేం సుబ్బమ్మా!"

"ఏదీ నాకూ యిప్పుడే తెలిసింది. లగెత్తి వచ్చా."

"సుభద్ర వట్టి కుళ్ళుబోతు, తన బియ్యం మనం కొట్టుకుపోతా మనుకుందో యేమో. దానికి తెలుసంట. ఎవరికీ సెప్పలేదు."

"దాని కొడుకు కమ్యూనిస్టు. ఆడే సెప్పివుంటడు."

కొట్టుదగ్గర కేకలెక్కువై అంతా అటు చూసేరు. కొత్తబస్తా లాక్కొస్తూంటే సుబ్బయ్య కొడుకు వాళ్ళకి అడ్డుపడుతున్నాడు. రంగ నాయకులు అతని రెక్కపట్టుకొని లాక్కుపోయి, అతడు అంతవరకూ కూర్చున్న బల్లముందు కుర్చీలో కూలబడేసేడు.

"ఇంకా ఇంతమందున్నారు. వాళ్ళందరికీ ఇవ్వందే వదిలేది లేదు."

జనం అంతా రంగనాయకులు మాటకు పత్తాసు సిచ్చేరు.

"బియ్యంనేక బువ్వండుకోనేదు బాబూ! మా కిప్పించు" అని జనంలోంచి ఒక కీచుగొంతు అంగలార్చింది. ఆమె వెనువెంట నాలుగు వైపులనుంచీ జనంలో తొక్కిసలాట ప్రారంభమయింది. వారిని నిలవ బెట్టచూస్తున్న వలంటీర్లకి అలవి కాలేదు. పెద్దగుంపుగా కొట్టుముందు పోగడ్డారు.

"ఇంకా కాదన్నావంటే జనం నిన్ను నలుచుకుంటారు. కొట్టు అంటూ మిగలదు జాగ్రత్త."

రంగనాయకులు అదిలింపు వినగానే జనాన్ని చూస్తున్న కొట్టు యజమాని గమ్మునై పోయేడు,

మరల క్యూ ఏర్పడి, వెనక ముందు ఆక్రమణల పేచీలు ప్రారంభ మైనాయి. రెండోవైపు తూకం సాగుతూనే వుంది. జనంలో క్రమం ఏర్పడుతున్న దశలో షావుకారు చటుక్కున బల్లవద్ద లేచి నిల్చున్నాడు.

"ఏడుకొండలుగారూ! రక్షించాలి. నా కొట్టు దోపిడి అయిపో తూంది."

అందరూ ఉలికిపడి తిరిగి చూసేరు. బూట్లు టకటక చప్పుడు చేసుకుంటూ పోలీసులు కొట్టు అరుగులక్రింద అడ్డుగా నిలబడ్డారు. సబిన్ స్పెక్టరు ఏడుకొండలు బియ్యం కాటావద్దకు నడుస్తూ గద్దించేడు.

"ఏమిటిది?"

"నా కొట్టు దోచేసేరు బాబూ! రక్షించాలి."

"తూచండి. పద్దక్కా నీ సంచిపట్టుకో." అని రంగనాయకులు హెచ్చరించేడు.

"నిన్నరెస్టు చేస్తున్నా."

ఒక పోలీసువాడు బియ్యంకోసం పద్మాక్షి పట్టుకొన్న చేతినంచిని కర్రతో తోసేసేడు. బియ్యం కిందపడిపోయేయి. రంగనాయకులు చటుక్కున ముందుకడుగు వేస్తూ గద్దించేడు.

"ఏమిటా దౌర్జన్యం! ఆవిడ రూపాయిచ్చింది. తూచు బియ్యం!"

ఈమారు సబిన్స్పెక్టరు చూస్తూ వూరుకోలేదు. రంగనాయకుల్నీ, తూస్తున్నవాళ్ళనీ తలో దెబ్బ వేసి అరెస్టు చేశాడు.

పద్మాక్షి "నా రూపాయ"ంటూ అరుగెక్కింది. జనం "మాకు బియ్యం అమ్మాలి." అంటూ తోసుకువచ్చేవాళ్ళు తోసుకువస్తున్నారు. పోలీసువాళ్ళనిచూసి భయపడి అక్కడే నిలుచుని కేకలేస్తున్నారు కొందరు.

పోలీసులు జనాన్ని వెనక్కి నెట్టేశారు. సబిన్స్పెక్టరు కొట్టు గుమ్మంలో నిలబడి జనానికి హామీలిస్తున్నాడు.

"గవర్నమెంటు త్వరలోనే చౌక డిపోలు తెరుస్తుంది. ఇల్లాంటి దౌర్జన్యాలు వొప్పుకోం. ఇళ్ళకెళ్ళండి."

రంగనాయకులు జనం మధ్యనుంచే అరిచేడు.

"అబద్ధం. గవర్నమెంటు ఇంతవరకూ ఏం చేసిందని అడగండి. వెళ్ళిపోకండి. కలక్టరాఫీసుకెళ్ళి అడగండి. ఇళ్ళకెళ్లేరా, మీ గతి యింతే చూడండి పోలీసు మద్దతుతో సుబ్బయ్య కొట్టు మూసేసేడు. వీళ్ళంతా తోడిదొంగలు."

* * *

"కమ్యూనిస్టోళ్ళ రోగం కుదిర్చేశాం." అంటూ ఇంట్లో అడుగు పెడుతున్న సుబ్బారావు పెళ్ళాం చూసిన చూపూ 'హం' అని ముక్కడం, చేతిలో వంచీ పెట్టడంతో విస్తుబోయేడు.

"ఆళ్ళ రోగం కుదర్చడానికేం గాని ముందెక్కడో ఇన్ని బియ్యం మట్టుకురా"

"నువ్వేళ్ళలా, ఏం రాజకీయం వెలిగిస్తున్నావు!" అంటూ సుబ్బారావు గంయ్‌మన్నాడు. ఆ గద్దింపుకు కాంతం బెదరలేదు. ఆమె వొళ్లు రగిలిపోతూంది. తానూ చర్రుమంది.

"నువ్వు కమ్యూనిస్టోళ్ళ రోగం కుదర్చలేవు. నీ రోగం కుదిరింది. వాళ్లు జనం మాడిపోతున్నారని పోలీసోళ్ళ కర్రదెబ్బలేన్నినా కాతరు చెయ్యకుండా కిలో రూపాయికి బియ్యం అమ్మిత్తున్నారు. నువ్వు షావుకారుగాళ్ల కొట్లకి కాపలా కాసి, కమ్యూనిస్టోళ్ళ రోగం కుదిరించేవు! మా లావు మగాడివి! యారికో రోగం కుదిరించేడట! సిగ్గు నజ్జ నేకపోతే సరి! ఘూ!"

దేశద్రోహం చేశారనుకుంటున్న కమ్యూనిస్టుల్ని జనం వెనుక వేసుకు వస్తున్నట్లు దారి పొడుగునా చూసిన సుబ్బారావుకి పెళాంకూడా అదేమాట అనేసరికి, తెల్లబోయి, తలగోక్కోడం తప్ప ఏమీ తోచలేదు.